ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

- ఉత్సాహంగా ర్యాలీలు
- కొనసాగిన ట్రాఫిక్ ఆంక్షలు

చార్మినార్: పాతబస్తీలో గురువారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. మక్కా మసీదు వద్ద మజ్లిస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ ర్యాలీని ప్రారంభించగా..చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు, ముస్లిం మత సంస్థలకు చెందిన మత పెద్దలు పాల్గొన్నారు. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు ఆహార పదార్థాలు, మంచినీరు, పానియాలను అందజేశారు.


చార్మినార్ వద్ద వేడుకల్లో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్


చార్మినార్-మక్కా మసీదు రోడ్డులో..


మాట్లాడుతున్న మౌలానా మతీన్ అలీషా ఖాద్రీ

సందడే..సందడి..

పాతబస్తీలో ఇతర ప్రాంతాల నుంచి బయలుదేరిన సామూహిక ర్యాలీలన్నీ మక్కా మసీదుకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం చార్మినార్, గుల్జార్ హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, చెత్తబజార్, పురానీహవేలి, మీరాలంమండి, కోట్లా ఆలిజా, బీబీబజార్, మొఘల్‌పురా ద్వారా మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చేరుకున్నాయి. తిరిగి కొంత మంది మళ్లీ యథావిధిగా వచ్చిన దారుల్లోనే చక్కర్లు కొట్టారు. ర్యాలీల సందర్భంగా ఆయా రోడ్లలో దక్షిణ మండలం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించారు.

ఎక్కడెక్కడ నుంచి..

జంగమ్మెట్‌లోని ఖాద్రీ చమాన్ దర్గా నుంచి బయలు దేరిన ప్రధాన ర్యాలీ చార్మినార్-మక్కా మసీదు వైపు కొనసాగింది. యాకుత్‌పురా, తలాబ్‌కట్టా, పురానీహవేలీ, డబీర్‌పురా, జంగమ్మెట్, చాంద్రాయణగుట్ట, మహ్మద్ నగర్, ఈదిబజార్, అక్బర్‌నగర్, మొయిన్‌బాగ్, బన్నాక, నషేమాన్‌నగర్, ఫతేషా నగర్, నశీబ్‌నగర్, బాబానగర్, ఉప్పుగూడ, బార్కాస్, తాళ్లకుంట, అల్ జుబేల్ కాలనీ,పురానాపూల్, హుస్సేనీఆలం, బహదూర్‌పురా, కిషన్‌బాగ్, తాడ్‌బన్, షంషీర్‌గంజ్, కామాటిపురా తదితర ప్రాంతాల్లోసందడి కనిపించింది.

ప్రవక్త మహ్మద్ జీవితం అందరికీ ఆదర్శం..

గోల్కొండ: ప్రవక్త మహ్మద్ జీవితం అందరికీ ఆదర్శం అని ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు కారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. గురువారం గోల్కొండ రిసాల బజార్‌లో జరిగిన మిలాద్-ఉన్-నబీ వేడుకల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవక్త మహ్మద్ జీవితం ఒక తెరిచిన పుస్తకం అని ఆయన నిష్కలంక చరిత్ర తెలిసిన వారు ఆశ్చర్యపోతారన్నారు.

మత సామరస్యానికి ప్రతీక హైదరాబాద్..

హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక అని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. గురువారం ఆయన మిలాద్ ఉన్ నబీ జల్సాలో పాల్గొన్నాడానికి చార్మినార్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గణేష్ నిమజ్జనోత్సవం, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రశాంతంగా జరగడం నగరవాసుల ప్రేమాభిమానాలకు చిహ్నం అన్నారు. మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, సయ్యద్ అబ్బాస్ హుస్సేన్, అబీబ్ చౌవుస్ తదితరులున్నారు.


వేడుకల్లో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు

యాకుత్‌పురాలో..

యాకుత్‌పురా: రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, యాకుత్‌పురా రైల్వే స్టేషన్, జాఫర్ రోడ్డు, బడాబజార్, గంగానగర్ నాలా, షేక్ ఫయాజ్ కమాన్, ఏతేబార్ చౌక్, అలీజా కోట్ల తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున్న ర్యాలీలు నిర్వహించారు. యాకుత్‌పురా, బడాబజార్, తలాబ్‌కట్టా, భవానీ నగర్, వోల్టా హోటల్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, తలాబ్ చంచలం కార్పొరేటర్ సమీనా బేగం, మజ్లిస్ పార్టీ అమన్‌నగర్-బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మొహినుద్దీన్‌తో కలిసి స్వాగతం పలికి ర్యాలీలో పాల్గొన్న వారికి ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో నరేంద్రమోదీ విచార్ మంచ్ చీఫ్ నేషనల్ కో ఆర్డినేటర్ రవి చాణిక్య

అఫ్జల్‌గంజ్: సీతారాంబాగ్ ఆలయంలో నరేంద్రమోదీ విచార్ మంచ్ చీఫ్ నేషనల్ కో ఆర్డినేటర్ రవి చాణిక్య ప్రత్యేక పూజలు చేశారు. నగరానికి వచ్చిన ఆయ న ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను చాటే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఆలయాల అభివృద్ధికి స్థానిక ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్, బ్రిజ్‌మోహన్ సింగ్, భరత్ సింగ్, మనోహర్ గైక్వాడ్, ఆలయ పూజారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మజ్లిస్ ప్రజల పార్టీ: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ ప్రజల కోసం ఆవిర్భవించి ప్రజల కోసమే పని చేస్తున్న పార్టీ అని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పదవులకు ఆశపడకుండా పని చేసే పార్టీ అని ఆయన అన్నారు. మజ్లిస్ సెక్యులర్ పార్టీ అన్న విషయం ప్రతిఒక్కరూ గుర్తించారని అందువల్లే ఆ పార్టీకి అన్ని ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. మహ్మద్ హర్షద్, సిద్ధిక్ తదితరులున్నారు.


మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

తెలుగు భాష, సంస్కృతులకు ప్రపంచ స్థాయి గుర్తింపు


అవార్డు గ్రహీతలతో బండారు దత్తాత్రేయ

నాంపల్లి: తెలుగు భాష, సంస్కృతులకు ప్రపంచ స్థాయిలోనే ఒక గుర్తింపు ఉందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా నిర్వహణలో రాంనగర్‌లోని గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసంలో ఎక్సలెన్స్ జాతీయ పురస్కారోత్సవ సభ జరిగింది. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ..మాతృభాషను నేర్చుకోవాలని, తద్వారా సంస్కృతి, సంప్రదాయాలు కలకాలం సజీవంగా ఉండిపోతాయని ఆయన వెల్లడించారు. నిర్వాహకుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా మాట్లాడుతూ.. 2016లో సంస్థ స్థాపించినప్పటి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వివిధ సంస్థలు, యూనివర్సిటీల భాగస్వామ్యంతో ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకులు రాయ్యూరు శేష సాయి, పుడమి సాహితీ వేదిక అధ్యక్షులు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన విభిన్న రంగాల్లోని 16 మందికి ఎక్సలెన్స్ జాతీయ పురస్కారంతో జ్ఞాపిక, మెడల్ ఇచ్చి ఘనంగా సత్కరించారు.

మేరు భవన నిర్మాణానికి కృషి చేయాలి


ఎంపీ ఈటల రాజేందర్‌కు మెమోరాండం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తుల కోసం మేరు భవనం నిర్మించేందుకు కృషి చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. మేరు భవనంతో పాటు విద్యార్థులకు విద్యార్థి వసతి గృహం కూడా నిర్మించాలని ఆయన అన్నారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌కు పోల్కం శ్రీనివాస్ మెమోరాండం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ద్వారా మేరు కులస్తులకు కుట్టుమిషన్లు, రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఖమ్మంలో వేలాది మంది మేరు కులస్తులు వరదల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఉప్పల్ బగాయత్‌లో మేరు కులస్తుల భవనం నిర్మించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాల మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, వెన్ను శివకుమార్, పల్లాల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం


గాజుల అంజయ్యకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలను అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించనున్నామని విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కమిటీ అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ప్రశాంత్ చారి తెలిపారు. ఈ నెల 22న ఉప్పల్ భగాయత్‌లోని విశ్వ బ్రాహ్మణ ఆత్మ గౌరవ భవన ప్రాంగణంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6.15 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యను గురువారం సాయంత్రం కలిసి ఆహ్వాన పత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు చొప్పదండి రామకృష్ణ చారి, కోశాధికారి మహేశ్వరం సూర్య ప్రకాష్ చారి, చార్ కమాన్ స్వర్ణకార చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ గంభీరావు పేట శ్రీనివాస రాజు, ట్రస్టు సభ్యులు అనంతోజ్ హన్స్‌రాజ్ పాల్గొన్నారు.

డీజే వాహనానికి షార్ట్ సర్క్యూట్

చార్మినార్: మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో అపశృతి దొరింది. వేడుకలను పురస్కరించుకొని గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు మక్కా మసీద్ చార్మినార్ ల నుంచి ఇతర ప్రాంతాలకు ర్యాలీలు కొనసాగుతున్నాయి. ర్యాలీల సందర్భంగా యువకులు పెద్ద ఎత్తున డీజే లను వినియోగిస్తూ ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు. అయితే రాత్రి 8.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు చార్మినార్ కట్టడం వద్ద నిమ్రా హోటల్ ఎదురుగా డీజే ఉన్న వాహనం విద్యుత్ ఘాతానికి గురైంది. వాహనంలోనే ఒక్కసారిగా మంట రావడంతో యువకులంతా కిందికి దూకడంతో ప్రమాదం తప్పింది. మొగల్ పురా అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. గురువారం ఆమె చౌకధరల దుకాణంలో అభయహస్తం పథకంలో భాగంగా రూ. 500కే వంట గ్యాస్ పథకం లబ్ధిదారులకు సబ్సిడీ పత్రాలు అందచేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 94,746 మంది లబ్ధిదారులకు ఈ పథకం మంజూరయ్యిందని, వారందరికీ ప్రభుత్వం సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-2025వ విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులను (అవర్లీ బేసిస్) నియమించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ ఓ ప్రకటనలో తెలిపారు. గణిత శాస్త్రంలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులు లేనిపక్షంలో పీజీ అభ్యర్థులకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. బోధనానుభవం కలిగిన వారికి వెయిటేజీ ఇస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ సర్వీస్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.


అధికారుల సమన్వయంతో సత్ఫలితాలు

చార్మినార్: వినాయక నిమజ్జనోత్సవాల్లో అధికారులు సమన్వయంతో పని చేయడంతో సత్ఫలితాలొచ్చాయని సీనియర్ సీపీఐ నాయకులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ కొనియాడారు. గతంతో పోలిస్తే ఈసారి పాతబస్తీలో నిమజ్జనోత్సవాలు త్వరగా ముగిశాయన్నారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా పోలీసులు ఎంతో స్నేహపూర్వకంగా వ్యవహరించారని..అలాగే ఉత్సవాల నిర్వాహకులు సైతం పోలీసులకు పూర్తిగా సహకరించారన్నారు. జీహెచ్‌ఎంసీ దక్షిణ మండలం జోనల్ కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్, విద్యుత్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసినందున ఉత్సవాలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగలేదని వీరందరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

నేడు శ్రీ సావిత్రి కన్యా ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

అఫ్జల్‌గంజ్: గౌలిగూడ మహారాజ్‌గంజ్‌లోని శ్రీ సావిత్రి కన్యా ఉన్నత పాఠశాల 82వ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే వేడుకలకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే రాజాసింగ్, జీహెచ్‌ఎంసీ బీజేపీ పక్ష నేత గౌంటి శంకర్‌యాదవ్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ప్రభుత్వ అధికారులు బుర్రా వెంకటేశం, దాన కిశోర్, శైలజ రామయ్యార్, ఎం.హన్మంతరావు తదితరులతో పాటు బేగంబజార్ పరిసర ప్రాంతాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు, వ్యాపారులు పాల్గొంటారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అబిడ్స్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రూప్‌బజార్‌లో లభ్యమైంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ట్రూప్‌బజార్‌లో ఓ వ్యక్తి రోడ్డుపై పడి ఉన్నాడని 100కు సమాచారం అందించారు. స్థానిక పోలీసులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం యాచకుడి(45-50)గా గుర్తించి ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ కేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మొదటి దశ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు న్యాయం చేయాలి


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బాధితులు

నాంపల్లి: మొదటి దశ లాటరీ పద్ధతిలో ఎంపికైన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు తొందరగా ఇళ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత నిరుపేద కుటుంబాల సభ్యులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు మొదటి దశ లాటరీలో ఎంపికైన బాధిత లబ్ధిదారులు లక్డీకాపూల్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మాకు రంగారెడ్డి జిల్లా మంకల్‌లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇళ్ల పట్టాలు ఇచ్చినా అక్కడి స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వివరించారు. దీంతో తాము ఇళ్లలో చేరలేకపోయినట్లు పేర్కొన్నారు. కాబట్టి సమస్యలను వెంటనే పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు కె.శ్రీనివాస్, సరస్వతి, నాగరాజు పాల్గొన్నారు.

ఇందిరాప్రియదర్శిని కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ


కళాశాల ప్రాంగణంలో చెత్తను ఊడ్చుతున్న కళాశాల ప్రిన్సిపాల్

నాంపల్లి: ఇందిరాప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కళాశాల ప్రాంగణ పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఎన్ఎస్ఎస్ యూనిట్స్ విద్యార్థులు సహకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి విశేషమైన స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, ఎన్ఎస్ఎస్ డిప్యూటీ సెక్రెటరీ పల్లవి, యూనిట్స్ సహాయకులు కళ్యాణి, అపర్ణ, నరసింహ పాల్గొన్నారు.

'కలిసి ఉంటే ఎటువంటి విభేదాలు ఉండవు'


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: కలిసి ఉంటే ఎటువంటి విభేదాలు ఉండవని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. కుటుంబ ఆస్తుల పంపకం విషయంలో గొడవ పడిన రెండు కుటుంబాల వారు గురువారం టోలిచౌకీలోని ఆయన కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ వారికి కుటుంబ విలువలు, కలిసి ఉండడం వల్ల ప్రయోజనాలను వివరించారు. బస్తీ లేదా కాలనీ పెద్దలు లేదా సమీప బంధువుల సమక్షంలోనే శాంతియుతంగా ఒక రాజీకి రావాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు కుటుంబాల పెద్దలు బస్తీ పెద్దల సమక్షంలో ఆస్తుల పంపకాన్ని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుంటామని అంగీకరించారు.

జేఎన్ఏఫ్ఏయూకి భూ కేటాయింపు ఆలోచనను విరమించుకోవాలి

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని గురువారం అంబేడ్కర్ వర్సిటీలోని అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ముక్తకంఠంతో ఖండించారు. భారతదేశంలోనే మొట్టమొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అని, అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెడుతూ ఎంతో మంది సబ్బంద, పేద విద్యార్థులకు దూర విద్య ద్వారా విద్యనభ్యసించుకునే వెసులుబాటు కల్పిస్తుందని ఈ సందర్భంగా ఉద్యోగులు స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్య ప్రతియేటా పెరుగుతూనే ఉందన్నారు. ఇప్పటికే యూనివర్సిటీలో ఉన్న బిల్డింగ్స్ ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సరిపోకపోవడంతో అటు విద్యార్థులు, ఉద్యోగస్తులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గుట్టలు, రాళ్లతో నిండిన క్యాంపస్‌లో ఒక్క ఎకరం జాగా కూడా నిర్మాణాలకు అనువుగా లేదన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం యూనివర్సిటీ స్థలాలను ఇతరులకు కేటాయిస్తే భవిష్యత్తులో తమ యూనివర్సిటీ అభివృద్ధికి, విస్తరణకు అవకాశం ఉండదని యూనివర్సిటీ ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తమ ఆలోచనను విరమించుకోకపోతే తీవ్రమైన ఉద్యమం ప్రారంభిస్తామని జేఏసీ హెచ్చరించింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలంటూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ సుధారాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అన్నిఉద్యోగ సంఘాల నాయకులు పల్లవి కాబ్డే , పుష్పా చక్రపాణి, మాధురి, చంద్రకళ, వెంకటరమణ, భోజు శ్రీనివాస్, బానోత్ ధర్మ, వెంకటేశ్వర్లు, ఎల్వీకేరెడ్డి, కృష్ణారెడ్డి, వేణుగోపాల్, నారాయణరావు, మహేశ్వర్‌గౌడ్, ఎండీ హబీబుద్దీన్, కాంతం, ప్రేమ్‌కుమార్, యాకేష్ దైద, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దంతాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


డబ్ల్యుఎస్‌ఈ డెంటల్ కేర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉర్ రెహ్మాన్

అబిడ్స్: ప్రజలకు డెంటల్‌పై ఉచితంగా సలహాలు, సూచనలు చేస్తామని ఉస్మానియా డెంటల్ ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉర్ రెహ్మాన్ పేర్కొన్నారు. దంతాలు పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అత్తాపూర్‌లో డబ్ల్యుఎస్‌ఈ డెంటల్ కేర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ న్యాచురల్ దంతాలను కాపాడుకోవాలన్నారు. న్యాచురల్ దంతాలు తీయడంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఉదయం, రాత్రి వేళ చిన్నప్పటి నుంచే తరచూ దంతాలను బ్రెష్‌తో శుభ్రం చేసుకోవాలని అలాంటప్పుడు ఎలాంటి దంత సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ద్రిష్యా, డాక్టర్ మిఫ్తా, డాక్టర్ గౌడ్, డాక్టర్ ముహి, డాక్టర్ సైప్ తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ


షేక్‌పేట్ నాలా వద్ద రోడ్డుపైనే నిర్మాణ సామగ్రి


గోల్కొండ: ఫుట్‌పాత్ రోడ్లను బడాబాబులు దర్జాగా కబ్జాలు చేసుకుంటున్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై భవన నిర్మాణానికి ఉపయోగపడే స్టీల్ రాడ్స్, ఇసుక, కంకర వేస్తున్నారు. పిల్లర్ల నిర్మాణానికి ఉపయోగపడే స్టీల్ రాడ్లను రోడ్లపైనే మిషన్‌లు పెట్టి కట్ చేయడం, పిల్లర్ జాలీని తయారు చేయడం వంటి పనులు కానించుకుంటున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునే వారిపై కొరడా ఝులిపించే ట్రాఫిక్ పోలీసులుగానీ, బల్దియా వారు గానీ బడాబాబుల జోలికి పోవడం లేదు. షేక్‌పేట్-టూంబ్స్ రోడ్డుపై ఓ బిల్డర్ ఫుట్‌పాత్‌ను పూర్తిగా ఆక్రమించి ఫుట్‌పాత్‌పైనే తమ భవనానికి సంబంధించిన సెక్యూరిటీ గార్డు డబ్బాను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. ఏదేమైనా ఫుట్‌పాతే కాకుండా రోడ్డు కూడా తమకు అందుబాటులో లేకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బుర్రకథ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆలడుగు నాగయ్య కళాపీఠం ఆధ్వర్యంలో పాలడుగు నాగయ్య రచించిన బుర్రకథ పుస్తకావిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ..దివంగత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్యపై పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం వివిధ కవులచేత నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు కె.కోటేశ్వర్‌రావు, రచయిత గంట మనోహర్‌రెడ్డి కవి రామకృష్ణ చంద్రమౌళి, పాలడుగు నాగయ్య కళాపీఠం చైర్మన్ సరోజినీదేవి, కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్మన్ రాధాకృష్ణ, నిర్వాహకులు పి.బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

అఫ్జల్‌గంజ్‌లో రక్తదాన శిబిరం



సాక్షి, సిటీ బ్యూరో: నగరానికి చెందిన తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్), తాంజీమ్ ఫోకస్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని అఫ్జల్ గంజ్‌లోని ఆసిఫియా సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో మౌలానా డా.అషన్ హమూమీషా పాల్గొని మాట్లాడారు. మానవత్వాన్ని, మానవసేవలే మిలాద్-ఉన్ నబీ సందేశంగా పేర్కొన్నారు. ఈ తరహా రక్తదాన శిబిరాల ద్వారా మిలాద్-ఉన్ నబీ స్ఫూర్తిని చాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. టీఎస్‌సీఎస్ నిర్వాహకులు డా.చంద్రకాంత్ అగర్వాల్ పాల్గొని మాట్లాడారు.